స్త్రీ పురుషులు అన్ని విధాలుగా స్థాయిలో జీవించాలని, ఎట్టి పరిస్థితులలో... స్త్రీపై పురుషుడు అధికృత చూపరాదని పెద్దలు అంటారు. ఐతే, ఈ ఎక్కువ తక్కువలనే సమస్య అసలు ఎలా ఉత్పన్నం అవుతుంది? భార్యాభర్తల మధ్య అభిప్రాయభేదాలు ఏర్పడితే, రాజీ కోసం మొట్టమొదట ఎవరు ప్రయత్నించాలి?

కాలింగ్ బెల్ విని తలుపు తీసింది పరమేశ్వరి. ఎదురుగా ఓ అపరిచిత యువతి. పాతికేళ్ళు పైబడి, పొట్టిగా, పీలగా చామనచాయ రంగుతో వున్న ఆమెని ఎక్కడా చూసిన గుర్తు లేక సందిగ్ధంగా చూసింది.

"మీరు పరమేశ్వరిగారేనా..." చిరునవ్వుతో నమస్కారం చేస్తూ అడిగిందా అమ్మాయి.

"ఆ, అవును... మీరు...?"

"నాపేరు సుగుణమణి అంటారండి. నేను మీ అభిమానినండీ... మిమ్మల్ని చూడాలని, మాట్లాడాలని వచ్చాను."

"అహా అలాగా... రండి లోపలికి... కూర్చోండి... నా ఎడ్రసు మీకెలా తెల్సింది?" చిరునవ్వుతో అడిగింది రచయిత్రి పరమేశ్వరి. ఆ అమ్మాయి లోపలికి వచ్చి కూర్చుంది.




# కథకానిది

**-డి. కామేశ్వరి**

"ఈ మధ్యే ఒక మాసపత్రికలో మీరు రాసిన 'జీవితం చేజార నీయకు' నవల చదివాక మిమ్మల్ని తప్పక కల్సుకోవాలనిపించింది. ఆ పత్రికాఫీసులో మీ అడ్రసు తీసుకుని ఇది వరకు ఒకసారి వస్తే మీరు కంట్రీలో లేరని ఫారెన్ టూర్ వెళ్లారని చెప్పారండి—అందుకని మళ్లీ యిప్పుడు వచ్చాను... మిమ్మల్ని కొన్ని ప్రశ్నలడగాలని, నా సందేహాలని తీర్చుకోవాలని వచ్చాను..."

"చాలా సంతోషం అమ్మా సుగుణమణీ, ఒక నవల చదివి రచయిత్రిని కల్సుకుని మాట్లాడాలని వచ్చినందుకు థాంక్స్... నాకు చేతనయినంతగా మీ సందేహాలని తీర్చడానికి ప్రయత్నిస్తాను. ముందు మీరేం తీసుకుంటారు? కాఫీ, టీ, కూల్ డ్రింక్" అతిథి మర్యాద కోసం అడిగింది పరమేశ్వరి.

"ఏం వద్దు. కొంచె చల్లని నీళ్ళివ్వండి చాలు..." అంది సుగుణ. పరమేశ్వరి యిచ్చిన నీళ్లు తాగింది.

"యిప్పుడు చెప్పండి మీ గురించి? మీరేం చేస్తుంటారు?" కుతూహలంగా అడిగింది పరమేశ్వరి.

"మొన్నటి వరకు గృహిణి ప్లస్ ఉద్యోగినిని. యీ రోజు కేవలం ఉద్యోగినిని మాత్రమే. జూనియర్ ఉమెన్స్ కాలేజీలో లెక్చరర్‌గా వున్నానండి." అదోలా నవ్వి అంది.

"అంటే..." అర్థం కాక సందిగ్ధంగా చూసింది పరమేశ్వరి.

"అంటేనా, మొగుణ్ని వదిలేసి ఉద్యోగం చేసుకుంటున్న ఆడదాన్ని—నేను మిమ్మల్నెందుకు కల్సుకోవాలనుకున్నానో తెలుసా? మీ నవల చదివాక నాకు చాలా

వచ్చింది. అసలు మీరా నవల రాయడంలో మీ ఉద్దేశం ఏమిటో చెపుతారా?" వచ్చింది మొదలు ఏదో అడిగేయాలన్న ఆమె ఆరాటం గుర్తించింది పరమేశ్వరి.

"ఆ నవల చదివాక కూడా మీకు యింకా నేను చెప్పదలచింది ఏమిటో అర్థం కాలేదంటే నేచెప్పదలచింది సరిగ్గా వ్యక్తం చేయలేకపోయానన్నమాట" పరమేశ్వరి నవ్వుతూ అంది. "అహ్ అది కాదు. అర్థం కాలేదని కాదు. మీరు సరిగా చెప్పలేదనీ కాదు... వాట్ ఐ మీన్, మీరా నవలలో మొగుడెలాంటివాడైనా... తిట్టినా, కొట్టినా సహించి ఆత్మాభిమానం చంపుకుని కాపురాలు చేసుకోండి. కాపురాలు పాడు చేసుకుంటే నష్టపోయేది ఆడవాళ్ళేనని చెప్పడంలో మీ ఉద్దేశం ఏమిటో కాస్త వివరంగా చెప్పగలరా..." ఆవేశంగా, దూకుడుగా అంది.

"మొగుడు తిట్టినా, కొట్టినా, హింసించినా నాథా నీవే గతి అని కాళ్ళ దగ్గర పడుండమని ఆ నవలలో నేనెక్కడా రాసిన గుర్తు లేదు నాకు." శాంతంగా నవ్వుతూ అంది పరమేశ్వరి.

"మీరేమిటి రాశారు? ఆ నిర్మల భర్తనించి వేరు పడి, తను కోల్పోయిందేమిటో గుర్తించి పశ్చాత్తాపపడి తనలా యింకో అమ్మాయి జీవితం చేజార్చుకోరాదని ఆ అమ్మాయికి నచ్చచెప్పి భర్త దగ్గరకి పంపి కాపురం కుదుటపర్చాలని తాపత్రయపడి కాపురం నిలుపుతుంది అని రాశారు. అంటే దానర్థం, యీ రోజు మొగుడ్ని వదిలిన వాళ్ళందరూ రేపు పశ్చాత్తాపపడితే ప్రయోజనం వుండదు మీ కాపురం ఎలాగైనా నిలుపుకోండి అని చెప్పడం కదా మీ ఉద్దేశం—" ఆవేశంగా నిలేసినట్టు అడిగింది.

"చూడమ్మా సుగుణమణీ... నీవు కాస్త ఆవేశం తగ్గించుకుని ఆ నవల మరోసారి చదివి చూడు... పరిశీలనగా చదివితే నేచెప్పదలచింది నీకర్థం అవుతుంది... ఓ రచయిత్రిగా ఏదో ఒక సాంఘిక సమస్య తీసుకుని నా నవలలో ప్రతిబింబింప చెయ్యాలనే నా తాపత్రయం. నేను స్త్రీని కనక స్త్రీల సమస్యలు ఏదో ఒకటి నా నవలలో ప్రతిబింబింప చేసి వీలయితే పరిష్కారం చూపడం, లేదంటే సమస్య యిది ఆలోచించండి అని తెలియ చెప్పడం నా ధర్మం-అందులో నీతో, మంచీ చెడో గ్రహించడం, మానడం పాఠకుల యిష్టం... అవునంటావా."

"అవునండీ. ఇది వరకు మీ నవలలన్నీ చదివాను... మీ 'కొత్తమలుపు' లో హీరోయిన్ తనని మోసం చేసి అన్యాయం చేసిన హీరోని పరువు ప్రతిష్ఠలు పక్కన పెట్టి కోర్టుకు లాగి బుద్ధి చెప్తుంది. మీ 'అరుణ' అందరినీ ఎదిరించి తన ఆశయం కోసం ప్రేమని త్యాగం చేసి పల్లెటూరిలో ప్రాక్టీసు పెట్టి ఆదర్శం నిలుపుకుంది—మీ 'వివాహబంధాలలో హీరోయిన్ భర్త బాధపెట్టి, ఇల్‌ట్రీట్ చేస్తే యింకో స్త్రీ సహాయంతో అతని పైఅధికారికి కంప్లైంట్ చేసి దారికి తెస్తుంది. మీ 'శుభోదయం'లో మానభంగానికి గురి అయిన స్త్రీ అది తన తప్పు కాదని, మానభంగం అన్నది శరీరానికి కాని మనసుకి కాదని అలా గురయిన స్త్రీలకి ఆత్మహత్యే శరణ్యం కానక్కరలేదని భర్తని ఎదిరించి వేరుపడి, తనలాంటి యింకో అమ్మాయిని కోడలుగా చేసుకుని ఆదర్శంగా నిలుస్తుంది. 'కోరికలే గుర్రాలైతే' నవలలో ఈ కాలం అమ్మాయిలు నవలలు సినిమాలు చూసి జీవితం గురించి ఏవో కలలు కని అవి నిజ జీవితంలో దొరక్కపోయే సరికి జీవితాన్ని ఎలా పాడుచేసుకుంటారో చక్కగా చెప్పారు..."

"మీరు నా నవలలన్నీ చదవడమే కాక గుర్తు పెట్టుకున్నారే బాగా..." ఆమె వాక్ప్రవాహాన్ని అడ్డుతూ అంది పరమేశ్వరి.

"అవును మీరు స్త్రీల సమస్యని ప్రతిబింబింప చేసే రచనలు చేస్తారన్నది నాకు నచ్చిన విషయం. మీ నవలలు అందుకే మిస్ కాను... కాని ఈసారి మీరిలా స్త్రీకి పిరికి మందు పోస్తూ రాయడం సహించలేక మీతో దెబ్బలాడాలని వచ్చాను." కాస్త చనువుగా, కాస్త దూకుడుగా నిలేస్తున్నట్టే అంది సుగుణమణి.

"సరేనమ్మా సుగుణా... ఆ నవలలో నీకు నచ్చనిది ఏమిటో ముందు చెప్పు. నిజంగా నేరాసింది తప్పు అని నీవు నన్ను నమ్మించ గలిగితే ఆ నవల ప్రింట్ అయి పుస్తక రూపంగా వచ్చే ముందే మార్చేస్తాను. ఆ నవలలో రాసింది తప్పు వెనక్కి తీసుకుంటున్నానని నా అభిప్రాయం పాఠకులకి చెప్పేస్తాను. సరేనా..." ఓ రచయిత్రి నించి ఈ విధమైన జవాబు ఆశించని సుగుణమణి ఒక్క క్షణం తెల్లపోయి తడబడింది. ఏం అనాలో అర్థం కానట్టు చూసింది.

"అదికాదండీ, పురుషుడు ఎలాంటి వాడైనా ఆడదే సర్దుకుని అడ్జెస్టయి బతకాలని మీలాంటి వారు కూడా అనడం నాకు బాధ కలిగించింది—"

"చూడమ్మా... ఆ నవలలో నేను చెప్పిందేమిటి? ఏ పురుషుడు గాని, ఏ స్త్రీ గాని పెర్‌ఫెక్ట్‌గా వుండరు. ఒక్కక్కరికి ఒక్కొక్క బలహీనతలుంటాయి. అందరి స్వభావాలూ ఒక లాగే వుండవు. భర్తలో లోపాలు ఎంచే ముందు, మనలో వీక్ పాయింట్లు ఏమిటో ఆలోచించుకోవాలి. తరువాత భర్తలో లోపం వుంటే అది సరి దిద్ది రిపేరు చేయగలమా అని ఆలోచించాలి ఒక్క క్షణం. శరీరంలో ఏదో రోగం వస్తే వెంటనే ఆ భాగం కోసి పారేసుకుంటున్నామా. డాక్టరు దగ్గరకెడతాం, మందులు పుచ్చుకుంటాం. మనం చెయ్యాల్సిన ప్రయత్నాలు అన్నీ చేసినా శరీరంలో అవయవానికి రోగం తగ్గక పోతే శస్త్ర చికిత్స చేయించి ఆ భాగం తీసేస్తాం కాని మొత్తం శరీరాన్నే త్యజించం గదా—అలాగే భర్తలో లోపం వుంటే నీ చాతనయినంతవరకు ప్రయత్నించి—అనురాగం, ప్రేమ, సహనం, ఓర్పు అనే ఏ మందులకీ అతనిలో గుణం కన్పించకపోతే శరీరానికి మరణం తప్పదు—అలాగే అప్పుడు నీ వివాహబంధానికి అంతం తప్పదు—చదువు, వ్యక్తిత్వం, ఆత్మాభిమానం, ఉద్యోగం అన్నీ వున్నాయి గనక ప్రతీ చిన్న లోపాన్ని భూతద్దంలో చూసి, మాట మాట పెంచుకుని, మనస్పర్థలు, కార్పణ్యాలు, అహాలు పెరిగి చిలికి చిలికి గాలివాన చేసుకుని ఆ గాలి తాకిడికి ఎటో వెళ్ళి పడి జీవితాన్ని వ్యర్థం చేసుకోకండి—ఏవో చిన్న చిన్న అపోహలతో కాపురం వదులుకొని తరువాత జీవితంలో పశ్చాత్తాపపడే అవసరం రానీయకండి. చిన్న లోపాలను క్షమించండి, సర్దుకోండి. అభిప్రాయ భేదం వస్తే కూర్చుని చర్చించుకోండి-మాట మాట పెంచుకుని, పంతాలు పెంచుకుని పరిస్థితి చెయ్యి జార్చుకుంటే ఒరిగేదేం వుండదు.' అని ఓ రచయిత్రిగా పాఠకులకి సందేశం యివ్వడం తప్పంటావా..." పరమేశ్వరి కాస్త ఆవేశంగానే అంది.

"క్షమ, ఔదార్యం, సహనం యివన్నీ వినడానికి చదవడానికి బాగుంటాయి. కొందరి మనుష్యుల వల్ల అవి ఆచరించడం ఎంత కష్టమో మీకిలా తెలుస్తుంది! ఏం? క్షమ, ఔదార్యం ఆడదే ఎప్పుడూ ఎందుకు చూపాలి? ఆడదే ఎప్పుడూ ఎందుకు ఎడ్జస్ట్ అయి సర్దుకు బతకాలి? ఎన్ని యుగాలైనా పురుషాహంకారానికి స్త్రీయే తల ఒగ్గి ఎడ్జస్ట్ అవమని మీలాంటి రచయిత్రులు రాస్తూంటే ఎన్ని యుగాలైనా స్త్రీ పురోగమనం ఎలా సాధిస్తుంది?"

"చూడు సుగుణా... ఈ ఎడ్జస్ట్‌మెంట్ అన్నది వివాహం విషయంలోనేనా? ఒక్క భర్తతోనేనా? జీవితంలో ప్రతి దశలో ప్రతి మనిషితో ఎడ్జస్టయ్యే మనిషి బతుకుతాడు... ఏం చిన్నతనంలో నిన్ను కన్న తండ్రో తల్లో కోపగించి తిడితే ఎడ్జస్ట్ అవకుండా యిల్లు వదిలి వాళ్ళని వదిలిపోయావా? అక్కో, అన్నో దెబ్బలాడి, కొడితే వాళ్ళతో తెగతెంపులు చేసుకుని వచ్చేశావా? ఈ రోజు నీ కాలేజీలో ప్రిన్సిపాల్ నీలో ఏదో తప్పు ఎత్తి చివాట్లు వేస్తే ఉద్యోగం వదిలేస్తావా? నీ తోటి లెక్చరర్లు నిన్నేదో వ్యంగ్యంగానో, హాస్యంగానో అంటే కాసేపు ఉడుక్కుంటావు గాని ప్రతి వాళ్ళతో తెగ తెంపులు చేసుకుంటున్నావా? అంత దాకా ఎందుకు? నీవు డబ్బిచ్చి పెట్టుకున్న మనిషి ఏమన్నా అంటే మానేస్తుందేమోనని ఆలస్యంగా వచ్చినా, నాగాలు పెట్టినా గట్టిగా ఏమనలేక సర్దుకుంటున్నావా లేదా? బస్సులో టిక్కట్టిచ్చి కూర్చోడానికి చోటులేకపోతే నిల్చుని సర్దుకుని ప్రయాణిస్తున్నావు కాని బస్సులో వెళ్ళడం మానేశావా? లేక బస్సు వాళ్ళతో రోజూ తగువు పెట్టుకుంటున్నావా? బజార్లో డబ్బిచ్చి సరుకు బాగున్నా లేకపోయినా వున్న దానిలో మంచిది ఏరుకుని సర్దుకుంటున్నావా లేక కొనడం మానేస్తున్నావా? డబ్బిచ్చి సినిమా టిక్కెట్టు కొనుక్కుని హాలు వాళ్ళు ఎ.సి. వేయకపోయినా చచ్చినట్టు ఉక్క భరించి సినిమా చూస్తున్నావా లేక సినిమాలు మానుకున్నావా లేక వాళ్ళతో దెబ్బలాట పెట్టుకున్నావా? అంత దాకా ఎందుకు? మన కడుపున పుట్టిన బిడ్డలు... ఎదిరించి నీవెంత అని సమాధానాలు యిస్తుంటే ఈ రోజుల్లో పిల్లలింతే అని సర్దిచెప్పుకుని వాళ్ళని చూసీ చూడనట్టు క్షమించుతున్నామా లేక పిల్లలేదో అన్నారని వాళ్ళని యింట్లోంచి తరిమేస్తున్నామా? మనిషి ప్రతి రోజూ ప్రతిక్షణం సర్దుకుని ఎడ్జస్టయ్యే బతుకుతాడు సుగుణా—కన్న తండ్రి అంటే తప్పుపట్టం, కన్న బిడ్డలు ఎదిరిస్తే సహిస్తాం-అక్క చెల్లెలు ఏదో అన్నా కాసేపు కోపగించుకున్నా సంబంధ బాంధవ్యాలు తెంపేసుకోం... పనిమనిషి అంటే పడతాం, పాలవాడు నీళ్ళు కలిపి మోసం చేసినా సహిస్తాం... రోజూ యిన్ని రకాలుగా ప్రతిక్షణం ఎడ్జస్ట్ అవుతూ బతికే మనం కేవలం భర్త మనల్ని ఏదో అంటే ఎందుకింత గింజుకుని గోరంతని

కొండతలుగా ఊహించుకుని, అవమానపడి అష్ట కష్టాలు పడ్తున్నట్లు, అదంతా సహించి పడుంటున్నామే యింకా యిలా ఎన్నాళ్లు? అని బాధపడి పోవడం ఎందుకు?" పరమేశ్వరి ధాటిగా ఉపన్యసిస్తున్నట్లంది.

సుగుణమణి మొహంలో రంగులు మారాయి... ఏదో అనబోయింది. అనే అవకాశం .ఆమెకివ్వకుండా మళ్లీ అందుకుంది పరమేశ్వరి.

"చూడు సుగుణా... ఎందుకో చెప్పమన్నావా... వివాహం అయ్యేవరకు తల్లితండ్రుల కట్టడిలో పెరిగిన మనం పెళ్లవగానే ఒక్కసారి స్వేచ్ఛ పొందినట్లు ఫీలవుతాం. నా మొగుడు, నా యిల్లు... సంసారం నాది, నా యిష్టం వచ్చిన రీతిలో వుండవచ్చు, నా మొగుడు నా మాట జవదాటడు, నన్ను అలరిస్తాడు, మురిపిస్తాడు, అన్న ఊహలతో కాపురానికి వస్తుంది ఆడపిల్ల—రాగానే భర్త కాస్త సౌమ్యుడు, సరసుడు అయితే గొడవలుండవు. కాని భర్త కాస్త అహంకారి, అహంభావి అయితే ఆమె కన్న కలలు తారుమారై కలవరపడిపోతుంది. భర్త అదుపాజ్ఞలు, కట్టడి ఆమె ఊహలని తల్లకిందులు చేసేసి తనేదో స్వతంత్రం కోల్పోయి బానిసలా భర్తకి లోబడి వుండడమా అన్న అహంకారం తలెత్తుతుంది భార్యలో-ఇదివరకటి స్త్రీకి చదువు సంధ్యలు ఆర్థిక స్వాతంత్ర్యం లేదు కనక భర్త ఏం అన్నా సహించి నాఖర్మ యింతే అనుకుని పడి వుండేది. భర్త కాస్త సంతోషంగా పలకరిస్తే పరవశించి, తిట్టిన నాడు ఏడ్చి నా బతుకింతే ననుకుంటూ యింట్లో చాకిరీ చేసుకుంటూ, పిల్లల్ని కంటూ అదే బతుకనుకొనేది. ఈనాటి ఆడపిల్లలకి చదువు, ఆర్థిక స్వాతంత్ర్యం రాగానే... ఏం మేం ఎందుకు అలాపడుండాలి? అని తిరగబడడం నేర్చుకున్నాక పంతాలు పట్టింపులు పెరిగి కాపురాలు వదులుకుంటున్నారు."

సుగుణమణి మళ్లీ ఆవేశంగా ఏదో అనబోయింది. పరమేశ్వరి ఆమెని చేత్తో వారిస్తూ, 'వుండు నన్ను పూర్తిగా చెప్పనీ, నే చెప్పడం అయ్యాక నీవు మాట్లాడుదువు గాని... సుగుణా యీ విషయం మధ్య అమ్మాయిలు ఒక విషయం మర్చిపోకూడదంటాను నేను. పుట్టిన తరువాత యిరవై ఏళ్లో పాతికేళ్లో తండ్రి మనల్ని కట్టడి చేస్తే ఎందుకు మనం సహిస్తున్నాం. ఆయన పెద్దవాడు, పెట్టి పోషిస్తున్నాడు—కన్నందుకు మన బాధ్యత తనది అనుకుని తండ్రి ఏమన్నా భరిస్తాం మనం—అలాగే పెళ్లియ్యాక తండ్రిలాగే భర్త పెద్దవాడు—యిరవై ఏళ్లు కాకుండా ఏభై ఏళ్లు మన బరువు బాధ్యతలని పైన వేసుకున్న అతను మనల్ని ఏ విషయంలోనన్నా కట్టడి చేసినా, ఆజ్ఞలు అధికారాలు జారీ చేసినా మనం ఎందుకు భరించం? ఎందుకింత బాధపడిపోతాం అన్నది ఒక్క క్షణం ఆలోచిస్తే మన బాధకు అర్థం లేదనిపిస్తుంది. నవలలో చెప్పినట్టు ఒక చోట ఎక్కువ రోజులు యిద్దరు కల్సి బతికితే కన్న తల్లితోనే సరిపడదు—పుట్టిన పాతికేళ్ల వరకు వేరువేరుగా బతికి పెళ్లి పేరుతో యిద్దరు బతుకులు ముడివేసుకుని ఒక యింట్లో ఓ. ఏభై ఏళ్లు బతకాలంటే జీవితంలో ఎన్ని రకాల ఎడ్జస్ట్‌మెంట్సు వుండాలంటావు! కాపురం నడవడానికి స్త్రీ, పురుషులిద్దరూ కావాలికనక ఒకరికి నచ్చనివి ఒకరు కొన్ని చూసీ చూడనట్టు వదిలేస్తూ, కాసింత క్షమ, ఔదార్యం చూపిస్తూ సర్దుకుపోవాలి గాని ఆడదానికి ఆర్థిక స్వాతంత్ర్యం వున్నంత మాత్రాన కాపురాలు వదులుకుంటే వివాహ వ్యవస్థే దెబ్బతింటుంది..." అని నేను చెప్పాను.

సుగుణమణి మొహం కాస్త మాడింది. 'అది సరే మీరు చెప్పింది బాగుందనుకోండి, నా పాయింటు మీకు అర్థం కాలేదు. ఈ ఎడ్జస్ట్‌మెంటు ఎప్పుడూ స్త్రీ వైపు నించే ఎందుకుండాలి... మీ నవలలో విద్య భర్త దగ్గరకి వెళ్లి అతన్ని మార్చడానికి ప్రయత్నించింది కాపురం కోసం... కానీ అతనేం పట్టనట్టు వూరుకున్నాడు గదా పురుషుడికి భార్య సంసారం అక్కరలేదా?"

"చూడమ్మా... పురుషుడూ ఎడ్జస్ట్ అవలేదని నీవెలా అనగలవు? ఆ నవలల్లో విద్య భర్త ఎంత అహంకారి, అహంభావి అయినా సంసారం కావాలనుకోబట్టే గదా కాస్త మెట్టు నటించి విద్యతో రాజీకి వచ్చాడు. ఎడ్జస్ట్ కాకపోతే, విద్యని బయటికి నెట్టచ్చుగదా? ఆడదాని అవసరం ప్రతి స్టేజీలోనూ పురుషుడికి కావాలి. చిన్నప్పుడు తల్లి, పెద్దయ్యాక భార్య, వార్థక్యంలో కూతురో కోడలో ఏ పురుషుడయినా ప్రతి దశలోనూ స్త్రీ మీద ఆధారపడక ఎలా వుండగలడు—సంసారం అన్నాక స్త్రీ పురుషులు ఒకరి కొకరుఆధారపడక ఏమవుతారు? ఎటొచ్చీ ఈ పురుషాధిక్య సమాజంలో తరతరాలుగా పురుషుడినన్న అహం, స్త్రీ కంటె తను పై మెట్టున వున్నానన్న భావం ఒక్కసారిగా మగవాడిలో ఎలా పోతుంది? పురుషుడి కంటే స్త్రీ ఏ విషయంలోనూ తీసిపోదని వారూ గుర్తించారు. గుర్తిస్తున్నారు. అయినా రక్తంలో జీర్ణించుకుపోయిన భావాలు ఒక్కసారిగా ఎలా పోతాయి? వంటింటి గడపదాటి స్త్రీ యీ స్థితికి చేరుకోడానికిన్నాళ్లు పట్టింది. ఇంకో తరంలో పురుషుడూ మారి భార్య స్థానం గుర్తించి ఆమెకివ్వాల్సిన విలువ, గౌరవం యిస్తాడు—"

సుగుణ అదోలా నవ్వి... "ఇవన్నీ మాటల్లో వింటుంటే బాగానే వుంటాయి. భర్త ఆదరణ అనురాగం లేని చోట వుండడం ఎంత కష్టమో మీకు తెలియదు. ప్రతి భార్యకి తన భర్త తనని ప్రేమించాలని, తనని అర్థం చేసుకుని సహకరించాలనుకుంటుంది. అలా జరగకుండా అతను అహంకారంతో ఆజ్ఞాపించి గుప్పిటలో బిగించాలని చూస్తే ఎంత సహనం ఓర్పు చూపాలంటారు? ఒక్క రోజు కాదు, నెలకాదు, ఎన్నాళ్లు అణిగిపడి వుండాలి—?" ఆమె ఆవేశం కోపంగా మారింది.

పరమేశ్వరి ఒక్క క్షణం సూటిగా ఆమె వంక చూసింది. "చూడమ్మా సుగుణా నేనొక మాట అంటాను కోపం తెచ్చుకోకుండా ఆలోచించు. చూడు... యిలా పెళ్లవగానే అలా నీ దాసుడయిపోవడానికి, నిన్ను సినిమాల్లో మాదిరి ఆరాధించడానికి, అతను చూడగానే పడిపోయేంత అందం నీలో ఏం లేదు. చూడడానికి అతి సామాన్యంగా వున్న నీవు అతన్ని అందంతో కాక నీ మంచి మనసుతో ఆకట్టుకోవాలి—తల్లిలా లాలించి, భార్యగా అనురాగంతో ముంచెత్తి అతన్ని ఆకట్టుకునే ప్రయత్నం నీవు చేశావా? ఇంతకీ మీ యిద్దరి మధ్య కలతలు ఎందుకు వచ్చాయో చెప్పనే లేదు... అసలు కారణం ఏమిటి—" కుతూహలంగా అడిగింది పరమేశ్వరి.

"ఎందుకేమిటి మేడమ్. ఆయనకి ఆడదానికి ఆత్మాభిమానం వుండడం, వ్యక్తిత్వం వుండడం నచ్చదు. యించుమించు ఆయనతో సమానంగా సంపాయించినా నా కోసం స్వతంత్రంగా ఏదీ ఖర్చుపెట్టుకోకూడదు. ఉద్యోగం చేస్తున్నా అరగంట ఆలస్యం స్వతంత్రం లేదు. నాకు యిష్టమయిన చీర కొనుక్కో నా యిష్టం వచ్చిన వాళ్లతో ఒక సినిమాకన్నా వెళ్లే స్వేచ్ఛలేని నేను ఆయన అదుపాజ్ఞలకి లొంగిపడి వుండలేదని—పొగరుబోతునని, భర్తంటే లెక్కలేదని, సంపాదన చూసుకుని విర్ర వీగుతున్నానని, కాపురం చేసే లక్షణాలు లేవని రోజూ ఏదో ఒక గొడవతో మనశ్శాంతి లేకుండా చేస్తే అలాంటి మనిషితో యింకో ఏభై ఏళ్లు ఎలా బతకమంటారు? అలా సర్దుకు బతకవలసిన ఖర్మ నాకు లేదు కనక యిల్లు వదిలి వచ్చాను... ఏం నేను చేసింది తప్పంటారా?"

"తప్పు అనను. కాని, అతని వైపు నించి ఆ కోణంలో ఆలోచిస్తే ఒకటి బోధపడ్తోంది నాకు. అతను నిన్ను చేసుకోడానికి కారణం నీ అందం కాదు కనక నీ సంపాదన మీద ఆశ! అతనికి డబ్బాశ వుందని అర్థం అయ్యాక ఏడ్చేపిల్లాడికి కావాలన్న బొమ్మ చేతికిచ్చేస్తే కాసేపు ఆడుకున్నాక వాడే పక్కన పడేస్తాడు—అతని మనస్తత్వం గ్రహించి ఓ ఏడాది ఆ డబ్బుని అతనికే యిస్తే ఆ యావ తగ్గేదేమో—అతన్ని ఆకట్టుకోడానికి నీవే విధంగానూ ప్రయత్నించలేదు కదా, పైగా నీవు సంపాదిస్తున్నన్న సంగతి అడుగడుగునా గుర్తు చేసి అతని అహాన్ని రెచ్చగొట్టి వుంటావు—" సుగుణమణి కోపంగా చూసింది.

"అంటే నేనేం మనిషిని కాదు దేవతననా మీ ఉద్దేశం—ఆయనేమన్నా కోపం తెచ్చుకోకుండా పరమ శాంతంగా వూరుకోడానికి—నాకు అభిమానం, పౌరుషం వుండకూడదనా"

"వుండవచ్చు. వుంటాయి అందరికీ—అదేం కాదనడం లేదమ్మా. ఈ నవల రాసిననేనుమాఆయనతో దెబ్బలాడనని కాదు. మా ఆయనకీ నాకూ భేదాభిప్రాయాలు రావనీ కాదు. మేమిద్దరం అరుచుకోమనీ కాదు. ప్రతి సంసారంలో యివి తప్పవు. యిద్దరు మనుష్యులు కల్సి బతికేటప్పుడు ఏ మాట, ఏ కోపం రాకుండా ఎలా వుంటుంది? ఎటొచ్చీ నే చెప్పదలచింది నవలలో చెప్పింది ఏమిటంటే... సంసారంలో వచ్చే చిన్న కలతలని సర్దుకోండి నైపుణ్యంగా... కాపురాలు వదులుకుని భవిష్యత్తులో ప్రతి నిమిషం టెన్షన్‌తో బతుకుతూ-ఏ అనుభూతులకి, స్పందనలకి నోచుకోకుండా బతికే ఒంటరి బతుకు కంటే కలతలు, కన్నీళ్లు వున్న సంసారమే బెటర్ ఏమో అన్నది నిర్మల కథ చెప్పిన తరువాత అర్థం అయ్యేట్టు రాశాను. చూడమ్మా... విద్యలా నీవింకా చిన్నదానివి, యివాళ వున్న యీ వేడి, వాడి, ఆవేశం మరో పదేళ్ల తరువాత నీలో వుండవు... అప్పుడు చేజార్చుకున్నది చూసుకుని పశ్చాత్తాపపడి ప్రయోజనం వుండదు—ఆడదానికయినా మగాడికయినా డబ్బొకటే కాదు కావాల్సింది. నా అనేవాళ్లు ప్రతి దశలోనూ వుండాలి. ప్రతి దశలోనూ, ప్రతి రోజు మనిషికి మార్పుకావాలి. మార్పు లేని గానుగెద్దు జీవితం మనిషిని పిచ్చివాడిని చేస్తుంది. ఇదంతా నవలలో చెప్పాను. చెప్పిందే చెప్పడం విసుగనిపిస్తుంది నీకు... నాకూ... నవల చదివావు గనక యింత కంటే ఏం చెప్పను."

"ఆ పాయింటే నేనూ అడగాలనుకుంటున్నానండీ... జీవితానికి పెళ్లి ముఖ్యమే గాని, పెళ్లే జీవితం కాదు కదండీ—జీవితంలో ఒంటరితనం లేకుండా వుండాలంటే మొగుడే వుండాలంటారా—మీరు నవలలో నిర్మల జీవితం చేజార్చుకుని ఒంటరి బతుకుతో పశ్చా

పడిందని రాశారు. ఏం మొగుడు, సంసారం ...తే జీవితం వ్యర్థమయి పోయినట్టు ఎందుకనుకో వాలి? చెయ్యాలంటే ఎన్ని మంచి పనులు లేవు? సంఘసేవ చెయ్యొచ్చు—అనాధలని ఆదరించవ చ్చు—వృద్ధులకి ఆశ్రమం కట్టించి నడపవచ్చు-అనాధ బిడ్డలని చేరదీసి పెంచుకుని కాలక్షేపానికి లోటు రాకుండా చేసుకోవచ్చు... కావాలనుకుంటే వంటరితనం పోగొట్టుకోడం మన చేతిలో పని అంటాను నేను." యిప్పుడేం చెబుతారన్నట్టు గర్వంగా సవాల్ చేసింది సుగుణమణి. పరమేశ్వరి వేదాంతిలా నవ్వింది.

"చూడమ్మా సుగుణా, ఇక్కడ వికలాంగుల శరణాలయం ఒకటుంది-అందులో సిస్టర్ నాకు బాగా తెలుసు. ఆవిడకి నేను చెపుతాను గాని, ఒక వారం రోజులు నువ్వక్కడికి వెళ్ళి వాళ్ళతో కలిసి వాళ్ళకి సేవలు చేసి వస్తావా? నీకు మంచి కాలక్షేపం—వంటరితనం బాధ వుండదు." సుగుణమణి తెల్లబోయి చూసింది. ఒక్క క్షణంలో మొహంలో రంగులు మారాయి—పరమేశ్వరి మాటల్లో వ్యంగ్యం అర్థమైంది. జవాబుకి తడబడింది.

"ఇప్పుడు నాకేం కాలక్షేపం లేదని నేననలేదే—నేనేం వంటరిగా ఫీలవుతున్నాననన్నానా?"

పరమేశ్వరి నవ్వింది—" చూడమ్మా యీ అనాధ సేవలు నీవు నేను అందరూ చెయ్యగల్గితే యిన్ని వెలమంది లక్షల మందిలో ఏ 'మదర్‌థెరిసా' లాంటి వారి పేరు ఒక్కటో రెండో మాత్రం ఎందుకు విని పిస్తాయి? అలా ఏ అనాధాశ్రమం, ఏ అంధులకు, కుష్టు రోగులకి వికలాంగులకి సేవ చెయ్యడం అంటే మాటలు కాదు—దానికి చాలా పెద్ద మనసుండాలి. అలాంటి నిత్య సేవకి ఎంతో త్యాగ బుద్ధి, సహనం, శాంతి, ఓర్పు, నేర్పు అన్నింటినీ మించి నిస్వార్థ బుద్ధి వుండాలి. రోగులని, వికలాంగులని, అనాథలని అసహ్యించుకోకుండా చేరదీసి ఆ సేవలో లీనమయి మనసా వాచా నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి సంఘసేవ అందరూ చేస్తే అందరూ మదర్ థెరిసాలయ్యేవారు. సంఘసేవ అంటే ఏ గాంధీ జయంతి నాడో ఏ అనాధాశ్రమానికో వెళ్ళి మిఠాయిలు పంచి, ఫోటోలు తీయించుకోడం కాదు—ఒక్క రోజు నీవలాంటి చోటికి వెళ్ళి అసహ్యం లేకుండా వాళ్ళలో ఒకరిగా కల్సి వాళ్ళకి సేవలు చేసిరా చూద్దాం—అలా చెయ్యగల్గిన వాళ్ళు మహనీయులు అవుతారు..." సుగుణమణి ఆ మాటలకి మొహం మాడ్చుకుంది.

"చూడమ్మా నీకింకా చిన్నతనం. సంసారం వదులుకుని వచ్చి పట్టుమని ఆరునెలలు కాలేదు. అందుకే నీలో యింకా ఆ వేడి తగ్గలేదు. ఈ రోజు నీ భావాలు యింకో పదేళ్ళు పోయాక వుండవు—యీ వేడి వుండదు. యీ, ఆవేశం స్థానంలో పశ్చాత్తాపం చోటు చేసుకోవచ్చు—మోనాటనస్ జీవితం కంటే కాస్త కలతలున్న సంసారం నయమేమోనని నిర్మలలా నీవు పశ్చాత్తాపపడ కూడదని నా కోరిక... సినిమాలలో పుస్తకాలలో మాదిరి ఏ భర్తా వుండడు. నిజ జీవితంలో ప్రతి దశలోనూ ఎడ్జస్ట్‌మెంట్ అనే పదానికి తప్ప ప్రేమలు, అనురాగాలు అనే పదానికి తావుండదు. నీ తల్లి వయసున్న దానిని, ఓ రచయిత్రిగా కాక పెద్దదానిగా చెప్తున్నాను. మరో ఛాన్సు యిచ్చి చూడు అయనకి—విద్యలా తెలివిగా ప్రవర్తించి మారినట్టు ఆయనకి నమ్మకం కల్గించు—అప్పటికీ మారకపోతే నీవెన్నుకున్న దవ నీకుండనే వుంది—అమ్మా సుగుణా నీవు ఎన్నుకున్న దారి నీ గమ్యం చేర్చదు—ఆ దారంట వెడితే అవస్థలపాలవుతావు. ఆ దారి ఎటుపోతుందో తెలియదు. యిది సరి అయినదారి అని మంచి చెడు తెలిపి చెప్పి ఆవేశంలో వున్న యువతులకి [illegible] తప్పుంటావా? రచయిత్రిగా నా బాధ్యత అది కాదంటావా—నీలాగే కొంత మంది—ఆడవాళ్ళకి పిరికి మందు పోశారు అని ఉత్తరాలు రాశారు. 'ఆడవాళ్ళూ... భర్త ఏదన్నా అంటే పడకండి. అమ్మాయిలూ, సంసారాలు వదులుకుని లేచి పోండి' అని రాస్తే పాఠకులు నన్ను కాకుల్లా పొడిచేవారు. చేతనయితే మంచి చెప్పాలి గాని, అసలే ఆవేశంలో ఏం చేస్తున్నదీ తెలియని వారిని ప్రోత్సహిస్తున్నట్టు నేను రచయిత్రిగా చెయ్యకూడదు. అన్యాయానికి తిరగబడాలి కాని, భార్యా భర్తల విషయంలో న్యాయాన్యాయాలు కాదు కావాల్సింది. పరస్పర అవగాహన... పరస్పర గౌరవం-ఆ గౌరవం భర్త యివ్వకపోతే యిచ్చేట్టు చేయడానికి ప్రయత్నించండి. అంత తొందరగా ఏ నిర్ణయానికి ఆవేశంతో రాకండి అని ఓ రచయిత్రిగా నేను చెప్పడం సబబో కాదో నువ్వే చెప్పు."

ఏక ధాటిగా ఉపన్యాసం యిచ్చి అల్సిపోయినట్టు కుర్చీలో వెనక్కి వాలింది పరమేశ్వరి. సుగుణమణి మొహం అవమానం వల్లో, సిగ్గు వల్లో నల్లబడింది. జవాబు ఏదో చెప్పాలని తడబడి సర్దుకుని నోరు తెరిచే సరికి కాలింగ్ బెల్ వినిపించింది. పరమేశ్వరి లేచి వెళ్ళి తలుపు తీసింది. గుమ్మం అవతల ఓ యువతి, యువకుడు. అపరిచితులు—వీళ్ళూ ఫాన్స్ కాదు గదా అనుకుంది.

"నమస్కారం అండీ, మీరు రచయిత్రి పరమేశ్వరిగారనుకుంటాం... మిమ్మల్ని కలుసుకోవాలని వచ్చాం. సారీ డిస్టర్బ్ చేయలేదు కదా... మీ నవల చదివి..." అతనన్నాడు.

పరమేశ్వరి నవ్వుతూ "యివాళెంత సుదినం. ఓ నవల చదివి పాఠకులు రియాక్టయి రచయిత్రితో మాట్లాడాలని రావడం నిజంగా సంతోషించదగ్గ విషయం. రండి లోపలికి, యిదిగో యీమె సుగుణమణి అని నవల చదివి మాట్లాడాలని వచ్చారు. ఇందాకటి నించీ అదే చర్చిస్తున్నాం."

"నాపేరు రవి అండీ, ఈమె నా మిసెస్ కృష్ణవేణి-యిద్దరం బ్యాంక్‌లో ఆఫీసర్లం-మేడమ్... మీ నవల చదివి మా ఆవిడకి జ్ఞానోదయం కలిగి..." నవ్వుతూ ఏదో అంటున్నాడు.

"ఇదిగో జ్ఞానోదయం నాకేనా... మీకూ అయింది..." అమ్మాయ్ గయ్ మంది మొగుడి మీద.

"అదిగో మళ్ళీ దెబ్బలాటకి దిగకు-మనం సంధి కుదుర్చుకుని యింకా రెండు రోజులన్నా కాలేదు. మేడమ్... మేం యిద్దరం పంతాలకి, పౌరుషాలకి పోయి యిద్దరికిద్దరం బిగుసుకుని ఆరు నెలలుగా విడిగా వున్నాం. ఆవిడ అలిగి పుట్టింటికి పోయి కూర్చుంది. నేనెందుకు పిలవాలన్న మగ అహంతో నేను కూర్చున్నాను.... "

"... ఆ సమయంలో మీ నవల 'జీవితం చేజారనీయకు' చదివాను. ఆ నవల్లో విద్యలా నేనూ నటించి ఆయన్ని మార్చగలనో లేదో చూడాలన్న పంతం వచ్చింది. పరీక్షించి మారకపోతే రచయిత్రిగారూ యిలాంటి అభూత కల్పనలు రాయకండి, మంత్రాలకి చింతకాయలు రాలవు అని మీతో దెబ్బలాడాలనుకున్నాను. ఇదంతా ఆయనకి తెలీదనుకోండి..."

"ఫార్చునేట్లీ... నేను బుద్ధిమంతుడినయిపోయాను మా కాపురం కుదట పడింది. అయితే మా ఆవిడకి తెలియనిదొకటుంది... ఆ నవల మా ఫ్రెండొకడు తెచ్చి యిస్తే నేనూ చదివాను. ఆవిడ రాగానే ఎందుకు వచ్చింది, ఏ ప్లానుతో వచ్చిందో నాకర్థం అయినా తెలియనట్టు నటించాను. ఆఫ్‌కోర్సు... అలాంటి అవకాశం నేనూ చూశాను కనక ఏం తెలీనట్టు నటించి... మారినట్టు నమ్మించాను." అతను చిలిపిగా నవ్వాడు భార్యని చూసి... ఆ అమ్మాయి ఒక్క క్షణం తెల్లబోయింది. తరువాత ఒక్కసారిగా "యూ చీట్..." అని అరిచి కోపం నటించి కొట్టబోయింది.

"ఇదిగో యిలా బిహేవ్ చేస్తే మళ్ళీ రాం, రాం నీకు నాకు." వాళ్ళిద్దరి చిలిపి కయ్యం చూసి పరమేశ్వరి నవ్వింది.

"మేడమ్ మేం యిద్దరం మీకు థాంక్స్ చెప్పాలని వచ్చాం—మమ్మల్ని కలిపిన మీ నవలకి, అది రాసిన మీకు మా కృతజ్ఞతలు... ఇన్నాళ్ళు సామాజిక స్పృహ వున్న రచన అంటే ఏమిటో అర్థం కాలేదు. అది యిప్పుడు తెల్సింది..." అతను ఆ అమ్మాయి మనస్ఫూర్తిగా అన్నారు. పరమేశ్వరి ఆ మాటకి చలించింది. కళ్ళు చెమర్చాయి. "ఇంతకంటే ఓ రచయిత్రికిచ్చే అమూల్యమైన కానుక ఏముంటుంది? ఓ రచన వల్ల ఒక కాపురం కుదుటపడిందంటే రచనకి, నాకు సార్థకత చేకూరింది. థాంక్స్... మీలాంటి దంపతులందరూ మరొక్కసారి ఆలోచిస్తే... చూడమ్మా సుగుణా, విన్నావు కదా వీళ్ళు చెప్పింది. నీవు ఒక ఛాన్సు యిచ్చి చూడు, ఇది రచయిత్రిగానే కాక, నీతల్లి లాంటి దానిగా చెప్తున్న మాట." సుగుణమణి భుజం తట్టి అంది పరమేశ్వరి.

సుగుణమణి యింత సేపూ ఓడిపోయిన దానిలా తలదించుకుంది. జవాబిచ్చేందుకు మాటలు రాలేదు. చాచిన చేతి వంక ఒకసారి చూసి పరమేశ్వరి చేతిలో చెయ్యివేసి గబగబా వెళ్ళిపోయింది.

• • •

సుగుణమణి మళ్ళీ వచ్చి చెప్తుందనుకున్న శుభవార్త కోసం పరమేశ్వరి ఎదురు చూసింది. ఏడాది దాటినా ఆ వార్త వినలేదు. ఓ రోజు హఠాత్తుగా సుల్తాన్ బజార్లో చేతిలో చంటి పిల్లతో దూరంగా కన్పించింది. గుర్తుపట్టి పిలిచేలోగా ఆమె వెళ్ళి పోయింది. ఆమెతో మాట్లాడలేక పోయినందుకు బాధపడలేదు పరమేశ్వరి. తెలుసుకోవాలన్నది తెలుసుకుని తృప్తిగా ఫీలయింది. □

**వచ్చే సంచికలో**
**సుప్రసిద్ధ రచయిత్రి**
**డి.కామేశ్వరి తమ విదేశీ యాత్రానుభవాలు వివరిస్తారు.**

Edited & Published by B. Viswanatha Reddi for DOLTON PUBLICATIONS, MADRAS-600 026
& Printed by B. V. REDDI at Prasad Process Private Ltd., Madras-600 026